క్లుప్తంగా

'బీఆర్‌ఎస్ స్వేదపత్రంతో కాంగ్రెస్‌కు కనువిప్పు'

దేవరుప్పుల: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పదేళ్ల హయాంలో జరిగిన శాశ్వత ప్రాతిపదిక అభివృద్ధి స్వేదపత్రంతో వాస్తవాలు ఆలోచించి కాంగ్రెస్‌కు కనువిప్పు కలుగుతుందని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి, జెడ్పీటీసీ పల్ల భార్గవి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం నీర్మాలలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ఫలాలపై విడుదల చేసిన స్వేద పత్రం కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు టీవీలు, సెల్‌ఫోన్‌లలో తిలకించారు.

'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

జనగామ రూరల్: ప్రజా సేవ చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై బాధ్యత గల ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ జిల్లా యూత్ అధ్యక్షుడు బనుక శివరాజ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న క్రిస్మస్ కానుకల విషయంలో అనవసరంగా రాద్ధాంతం చేస్తూ నాయకులను పందికొక్కులు అని ఎమ్మెల్యే పల్లా మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణం ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, అధినారాయణ, ఆలేటి సిద్దిరాములు, బాలరాజు, దాసరి క్రాంతి, ప్రకాష్, రమేష్, ధర్మేందర్, శీలం కొండల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, గణేష్, మహిపాల్, రాజు, వెంకట్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్టీసీ బస్సు–బైక్ ఢీకొన్న ప్రమాదంలో అనంతపురం కృష్ణ, మహేశ్వరి దంపతులకు గాయాలైన సంఘటన మండలంలోని రాఘవాపూర్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటికొండకు చెందిన అనంతపురం కృష్ణ, మహేశ్వరి దంపతులు రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో జరిగిన ఓ కార్యానికి బైక్‌పై వెళ్లి సాయంత్రం తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో రాఘవాపూర్ బస్‌స్టాప్ వద్ద బైక్ రోడ్డు క్రాస్ చేస్తున్న క్రమంలో హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో వారిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదానికి కారకుడైన డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రఘునాథపల్లి ఎస్సై చాగర్ల రఘుపతి ఆదివారం తెలిపారు. మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన మానంపల్లి పుల్లాజి శనివారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రం నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తూ రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న డీసీఎం ఢీ కొట్టింది. దీంతో పుల్లాజికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు గుర్తించి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బైంసాకు చెందిన డీసీఎం డ్రైవర్ వెల్పుల యాకయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చర్య తీసుకోవాలి



చిల్పూరు: పాత భూ తగాదాను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ భూమి వద్ద ఫెన్సింగ్ ఖనీలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్య తీసుకోవాలని మండలంలోని పల్లగుట్టకు చెందిన రైతు కొంతం రవీందర్ అన్నారు. ఈ మేరకు బాధిత రైతు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, ఎస్సై వినయ్‌కుమార్ మాట్లాడుతూ పల్లగుట్టకు చెందిన రవీందర్ ఫిర్యాదు మేరకు బాధ్యులపై చర్య తీసుకుంటామని తెలిపారు.

బియ్యం అందజేత

జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన తరాల శ్రీను ఇటీవల మృతి చెందాడు. కాగా, గ్రామానికి చెందిన వాలీబాల్ యూత్ సభ్యులు బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం ఆదివారం అందజేశారు. వాలీబాల్ యూత్ అధ్యక్షుడు పిట్టల నాగరాజు, ఉపాధ్యక్షుడు మల్లయ్య, ఉప సర్పంచ్ సందీప్ ఉన్నారు.

ఆర్‌సీఎం చర్చి సందర్శన

స్టేషన్‌ఘన్‌పూర్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా స్థానిక ఆర్‌సీఎం చర్చిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, ఆయన సతీమణి ఫాతిమామేరి ఆదివారం రాత్రి సందర్శించారు. క్రిస్మస్ వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం నేడు నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకల నిర్వహణపై చర్చి విచారణ గురువు ఫాదర్ అగస్టీన్‌రెడ్డితో చర్చించారు. రాజు, నాగయ్య, శ్రీను ఉన్నారు.

'స్టేషన్'లో సమస్యల తిష్ట

- పేరుకే మోడల్ రైల్వేస్టేషన్
- పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు ప్రయాణికుల డిమాండ్



స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్



రైలు పట్టాలు దాటుతున్న ప్రజలు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి జంటపట్టణాలకు కలిపేలా ఉన్న స్థానిక రైల్వేస్టేషన్‌లో ఏళ్ల తరబడి పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. దాదాపు 125 ఏళ్ల క్రితం అప్పటి నిజాం ప్రభుత్వంలో ఎన్‌ఎస్‌ఆర్ (నిజాం స్టేట్ రైల్వే) పేరిట ఇక్కడ రైల్వేస్టేషన్ ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఘనమైన చరిత్ర ఉన్న స్థానిక రైల్వేస్టేషన్‌లో సమస్యలు కూడా మేజర్‌గానే ఉన్నాయి. గతంలోనే స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా గుర్తించినా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉన్నాయి. స్థానిక వ్యాపారులు, ప్రజలు పలుమార్లు సమస్యలను ఎస్‌సీఆర్ జీఎంతో పాలు పలువురి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ దక్కేనా..

స్థానిక రైల్వేస్టేషన్‌లో పుష్‌పుల్, కాకతీయ ప్యాసింజర్ రైళ్లు, భాగ్యనగర్, గోల్కొండ, ఇంటర్‌సిటీ, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉంది. అయితే ఇక్కడ ఆలేరు, జనగామ స్టేషన్‌లతో పోలిస్తే ఆదాయం మెరుగ్గా ఉంటుంది. అయినప్పటికీ ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణికులకు సికింద్రాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా రైళ్ల సౌకర్యం లేక సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో లారీలు తదితర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ పద్మావతి, గౌతమి, మచిలీపట్నం, హౌరా, శాతవాహన, దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ప్రజల నుంచి తీవ్రంగా డిమాండ్ ఉంది. అదే విధంగా క్యాంటిన్, టాయిలెట్ల సౌకర్యం సరిగ్గా లేదు. రెండు ప్లాట్‌ఫారాల్లో షెడ్‌లు పూర్తిస్థాయిలో లేక వర్షాకాలం, వేసవికాలంలో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక అవస్థలు

ఘన్‌పూర్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి సౌకర్యం ఉండటంతో దాదాపు మూడేళ్ల క్రితం రైల్వే గేటును పూర్తిగా మూసివేసి గేట్‌మన్‌ను తొలగించారు. అప్పటి నుంచి పాదచారులు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లాలంటే దూరం అవుతుందని గేటు ప్రాంతం నుంచే రైలు పట్టాలు దాటుతున్నారు. దాంతో పలువురు రైలు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో కాలినడపక వెళ్ళే వారికి అనువుగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నా అధికారుల నుంచి స్పందన లేదు.

ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలి



ఘన్‌పూర్‌లో టికెట్ కౌంటర్ ద్వారా రైల్వేకు మంచి రెవెన్యూ ఉంటుంది. ప్రయాణికుల కోరిక మేరకు ఘన్‌పూర్‌లో శాతవాహన, దక్షిణ్, గౌతమి తదితర ఎక్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పిస్తే అన్ని వర్గాల ప్రజలకు అనువుగా ఉంటుంది.

- యంజాల ప్రభాకర్

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



ఘన్‌పూర్‌లో రైల్వేగేటు ప్రాంతంలో గేటును పూర్తిగా మూసివేశారు. దాంతో ప్రమాదమని తెలిసినా పలువురు పాదచారులు గేటు మార్గం గుండా వెళ్తుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

-పాలకుర్తి సోమశేఖర్

సమస్యలు పరిష్కరించాలి



స్థానిక రైల్వేస్టేషన్‌లో సమస్యలు అధికంగా ఉన్నాయి. 125 ఏళ్ల చరిత్ర ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ పేరుకే మోడల్ రైల్వేస్టేషన్‌గా ఉంది. అధికారులు స్పందించి ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న పద్మావతి, దక్షిణ్, శాతవాహన తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి.

- పార్శి రంగారావు

పార్టీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న రాపర్తి రాజు

లింగాలఘణపురం: ప్రజా ఉద్యమాలే ఊపిరిగా, సమస్యల పరిష్కారంలో ముందున్న సీపీఎంను మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు రాపర్తి రాజు కోరారు. ఆదివారం మండలంలోని కళ్లెంలో సీపీఎం మండల కమిటీ సమావేశం చెన్నూరి ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా రాజు పాల్గొని మాట్లాడారు. మండలంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు లేవని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. మండల బాధ్యుడు దేవదానం, మండల కమిటీ సభ్యులు సమ్మయ్య, ఉప్పలయ్య, వెంకటేష్, హతియాబేగం తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

లింగాలఘణపురం: భారత్ వికసిత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆదివారం మండల కేంద్రం, కొత్తపల్లి గ్రామాల్లో ఆర్‌బీఐ కౌన్సిలర్ రవివర్మ ప్రజలు అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు విజయ్‌మనోహర్, తుంగ శ్రవంతి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పీఎం జన్‌ధన్ యోజన, సురక్ష, ముద్ర యోజన తదితర పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ వీరాంజనేయులు, డాక్టర్ కిరణ్, సీసీ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంతోషి, ఆశ వర్కర్లు, వీఓఏలు పాల్గొన్నారు.

'డబుల్ ఇంజన్ సర్కారు రావాలి'

బచ్చన్నపేట: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని, లోక్ సభ ఎన్నికలను ఎప్పుడు నిర్వహించినా వాటికి అనుగుణంగా కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని ఇండియన్ యూత్ కాంగ్రెస్ జిల్లా కోఆర్డినేటర్ చల్ల ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఢిల్లీలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల్లో 17 స్థానాల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసి ఢిల్లీ పీఠంపై ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీని కూర్చోబెట్టాలని కోరారు. శ్రీనివాస్, కృష్ణాజీ, వరుణ్‌పాండే, యువసేనరెడ్డి ఉన్నారు.

'బాలయేసు'లో క్రిస్మస్ వేడుకలు



బాలయేసు హైస్కూల్‌లో క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లు



పశువుల పాకలో బాలయేసు ప్రతిమ

దేవరుప్పుల : క్రిస్మస్ వేడుకలు పురస్కరించుకొని మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు ఆధ్వర్యంలో విద్యుత్ అలంకరణలతో భారీ ముస్తాబు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఫాదర్ దీలీప్‌కుమార్, ఇరుదయ రాజు, జాన్ తదితరులు కలిసి యేసు జన్మదిన ప్రాశస్త్యాన్ని వివరించి కేక్ కట్ చేశారు. యేసు జనన విశిష్టతను తెలిపే సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఉత్సవాల్లో ఎన్‌సీసీ విద్యార్థులు తమ సేవలు అందించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జఫర్‌గఢ్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



కొడకండ్ల: గురువులతో పూర్వ విద్యార్థులు



బచ్చన్నపేట: సమ్మేళనంలో 2006-2007 బ్యాచ్ విద్యార్థులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 1992–93 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం నాటి గురువులను శాలువాలు, పూల దండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.40 వేల విలువ చేసే స్పోర్ట్స్ యూనిఫాంను పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లకు అందజేశారు. నాటి ఉపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రావు, ఎల్లయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎల్లాచారి, దాత రాజిరెడ్డి పాల్గొన్నారు.

రామవరంలో..

కొడకండ్ల: మండలంలోని రామవరం ఉన్నత పాఠశాలలో 2005–06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్‌ఎం జక్కుల ప్రభాకర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురువుల స్థానం ఉన్నతమైందని, తల్లిదండ్రులను బాగా చూసుకోవడంతో పాటు తమ పిల్లలకు మంచి విద్యను అందించి ఉన్నత ఖ్యాతి గడించేలా చూడాలని పూర్వ విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులు, పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని గురువులకు పాదపూజ నిర్వహించి సన్మానించాను. అనంతరం పాఠశాలకు మైక్‌సెట్‌ను బహూకరించారు. ఎల్లంబట్ల వెంకటేశ్వర్లు, ఆంజనేయచారి, రవీదర్, సోమనారాయణ, ఉపేందర్, వేణు, వెంకటయ్య, వెంకటాద్రి, మంజుల, యాక లక్ష్మి, మహేందర్, వీరయ్య పాల్గొన్నారు.

పోచన్నపేటలో..

బచ్చన్నపేట: పోచన్నపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 2006–2007 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని మండల కేంద్రంలోని శ్రీమా గార్డెన్‌లో నిర్వహించారు. ముందుగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులు బాలకుమార్, అశోక్‌కుమార్, రవీందర్, సబిత, ఐలయ్య, కిషన్, వేణుగోపాల్, పూర్వ విద్యార్థులు ఇంద్ల తారక్, చింతపండు బాలకృష్ణ, మట్టి సందీప్, తుప్పతి భాస్కర్, సంగని శ్రీకాంత్, ఆరె హరి, గిరి, శివకుమార్, నరేందర్, మల్లేష్, ఎల్లేష్, శాజహాన్ పాల్గొన్నారు.

'భద్రాద్రి జోన్‌లో కలిపే వరకూ పోరాడుతాం'



మాట్లాడుతున్న రమేశ్

జఫర్‌గఢ్: మండలాలను భద్రాద్రి జోన్‌లో కలిపే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారపాక రమేశ్ ప్రభుత్వాన్ని అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి ఎమ్మెల్యే రాజయ్య జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూర్ మండలాలను యాదాద్రి జోన్‌లో చేర్చి ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారన్నారు. ఈ మండలాలను హనుమకొండ జిల్లాలోనే కొనసాగించాలని ప్రజలు, విద్యార్థులు అప్పట్లోనే ఆందోళనలు చేపట్టినా నాటి పాలకులు పట్టించుకోలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లేకుంటే ఈ ప్రాంత నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ మండలాలను భద్రాద్రి జోన్‌లో కలుపాలన్నారు. లేని పక్షంలో తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనూప్, బన్నీ, సిద్దార్థ ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



కొడకండ్ల: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధసేవాసమితి హిందూ జ్ఞాన వేదిక సూర్యాపేట కమిటీ అధ్యక్షుడు వీరయ్య ఆధ్వర్యంలో ఆదివారం మండలకేంద్రంలో ప్రచారం నిర్వహించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరం తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని వీరయ్య అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో అన్ని కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో అసమానతలను తొలగించడానికి, సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని దైవభక్తిని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో భవాని, నక్షత్ర, ప్రవీణ్, శుభకృతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పెరికలు సంఘటితం కావాలి



బచ్చన్నపేట: పెరికలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే సంఘటితం కావాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుంకరి ఆనంద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన బోడ అంజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంఘం సభ్యుడు అయినందున సంఘం నుంచి రూ.10 వేల ఆర్థికసాయం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పట్టణ అధ్యక్షుడు మంచాల వెంకటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడిషెట్టి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు ముత్తినేని వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సందెల బాలసిద్దులు, మంచాల సంతోష్, , వివేక్, హరినాథం, మల్లేశం, కరుణాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు



జనగామ: బస్టాండ్ చౌరస్తాలోని ఉంద్రుపుర సెంటినరీ బాప్టిస్టు చర్చి



స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆర్‌సీఎం పెద్ద చర్చి

సాక్షి నెట్‌వర్క్: క్రైస్తవుల పర్వదినమైన క్రిస్మస్ సందర్భంగా జిల్లాలోని చర్చిలను క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సర్వాంగసుందరంగా అలకంరించారు. చర్చిలకు రంగులు వేసి ఆకర్షణీయంగా స్టార్స్, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా గ్రామాల్లో నేడు(సోమవారం) క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల కోసం పాస్టర్లు, ఫాదర్లు, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేశారు.



జనగామ: స్టార్స్ కొనుగోలు చేస్తున్న క్రైస్తవులు



హనుమకొండ రోడ్డులోని క్యాథలిక్ చర్చి



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



బస్టాండ్ చౌరస్తాలో..

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సుప్రభాత ర్యాలీలో భజన మండలి సభ్యులు

దేవరుప్పుల: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని పెద్దమడూరులోని శివాలయంలో శ్రీరామదాసు భజన మండలి తెలుగు రాష్ట్రాల సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ద్వాదశి సందర్భంగా సేవా సొసైటీ రాష్ట్ర శాఖల అధ్యక్షుడు మాన్యపు సిద్దేశ్వర్ ఆధ్వర్యాన హనుమాన్ ఆలయం నుంచి నగేశం మహాదేవ ఆలయం వరకు పురవీధుల గుండా గ్రామ సుప్రభాత భజన జరిగింది. అనంతరం శివాలయంలో అభిషేక మహోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. శివలింగంపై పాలు, తేనె, అరటి పండ్లతో ప్రత్యేక అభిషేకం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి మోటకోదూరు శ్రీనివాసశర్మ, జిల్లా శాఖ కోశాధికారి. గందె లక్ష్మయ్య, మల్లిపెద్ది నర్సయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు పట్వారి శేఖర్, కార్యదర్శి అక్కల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కొమరగాని పద్మ పాల్గొన్నారు.

చిల్పూరు ఆలయానికి పోటెత్తిన భక్తులు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వేద మంత్రాల నడుమ ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, ఆలయ శాశ్వత అభివృద్ధి కమిటీ చైర్మన్ దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, దాత సంగోజు మోహనాచారి–శంకర్ లక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్, వీరన్న, కృష్ణ, మల్లికార్జున్, వసంత, లక్ష్మి, మహేష్, విశాల్, శేఖర్, మల్లికార్జున్, రాజశేఖర్, హరిశంకర్, రాజేష్, స్వరూప, అజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న శేషారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండకు చెందిన 20 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత రాపోలు శేషారెడ్డి హనుమకొండ రోటరీ క్లబ్ వారి సహకారంతో ఆదివారం ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 6 నుంచి 9వ తరగతి విద్యార్థినుల్లో 2 కిలో మీటర్లు, ఆపై దూరం నుంచి వస్తున్న వారికి తమవంతుగా ఉచితంగా సైకిళ్లను అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం, దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.

నిరాశ్రయులకు తోడ్పాటు అందిస్తాం

దేవరుప్పుల: మండలంలోని చింతబాయి తండాలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైన కునుసోత్ మధుకర్ కుటుంబానికి ప్రభుత్వపరంగా తగిన సాయం అందిస్తామని కాంగ్రెస్ మండల నాయకుడు, సీతారాంపురం సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్ అన్నారు. ఆదివారం తండాలో మధుకర్, మంజుల కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. లక్ష్మణ్‌నాయక్, వార్డు మెంబర్ నిమ్మల గణేష్ ఆలకుంట్ల ప్రవీణ్ చింత శ్రీకాంత్, ధారవత్ తండా గ్రామ శాఖ అధ్యక్షుడు రాజేందర్, యూత్ అధ్యక్షుడు కిరణ్, సావిత్రి, కిమానాయక్, దేవ నాయక్, తుక్య నాయక్ ఉన్నారు.